



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
మార్చి 10, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# మనమే చాంపియన్స్




**చాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్**

**మూడోసారి టైటిల్ గెలిచిన టీమిండియా**

**ఫైనల్లో న్యూజిలాండ్‌పై 4 వికెట్లతో విజయం**

**రోహిత్ శర్మ అర్ధ సెంచరీ**

**రాణించిన నలుగురు స్పిన్నర్లు వరుణ్, జడేజా, కుల్దీప్, అక్షర్**

భారత జట్టు మరోసారి తమ చాంపియన్ ఆటను ప్రదర్శించింది. తొలి మ్యాచ్ నుంచి అన్ని రంగాల్లో ఆధిక్యం ప్రదర్శిస్తూ వచ్చిన జట్టు అజేయంగా విజయప్రస్థానాన్ని ముగించింది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సమష్టి ఆటతో ఒక్కో ప్రత్యర్థిని పడగొడుతూ వచ్చిన జట్టు తమ స్థాయికి తగ్గ విజయాన్ని అందుకుంది. ఏడాది వ్యవధిలో మరో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టైటిల్‌ను సొంతం చేసుకొని ప్రపంచ క్రికెట్‌పై తమ ఆధిపత్యాన్ని స్పష్టంగా చూపించింది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిని పూర్తిగా మరచిపోయేలా కాకపోయినా... ఈ ఫార్మాట్‌లో మరో ప్రతిష్టాత్మక టైటిల్‌ను గెలుచుకొని అభిమానులకు ఆనందాన్ని పంచింది. 2013లాగే ఒక్క ఓటమి కూడా లేకుండా టీమిండియా ట్రోఫీని గెలుచుకోవడం విశేషం. ఫైనల్లో టాస్ ఓడినా న్యూజిలాండ్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేయడంతోనే భారత్‌కు గెలుపు దారులు తెరుచుకున్నాయి. మన స్పిన్

(మిగతా 2వ పేజీలో)

# బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

**42 శాతం రిజర్వేషన్లను ఆదిలోనే అడ్డుకునే ప్రయత్నాలు**

**అఖిలభారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపితే మోదీ మెడపై కత్తి పెట్టినట్లే..**

**బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది**

**మా సర్వే తప్పని ఏవిధంగా చెబుతున్నారో పక్కా ఆధారాలతో రావాలన్నాం..**

**మా సవాల్ స్వీకరించకుండా బీజేపీ, బీఆర్ఎస్ తప్పించుకుంటున్నాయి**

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలు ఎదగకుండా, వారికి 42 శాతం రిజర్వేషన్లు అందకుండా ఆదిలోనే అడ్డుకునే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని.. దానితో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్లే ఆయా పార్టీల నేతలు లేనిపోని అపోహలు సృష్టించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను బీసీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి

(మిగతా 2వ పేజీలో)






విజయశాంతి



అద్దంకి దయాకర్



శంకర్‌నాయక్

# ఎన్నిక ఏకగ్రీవమే!

**ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్**

**సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం.. బీఆర్ఎస్ నుంచి దాసోజు ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి అభ్యర్థుల ప్రకటన**

**అనూహ్య పరిణామాలేవైనా జరిగితే పోలింగ్‌కు చాన్స్**



## సమీకృత గురుకులాలకు 11,000 కోట్లు

ఒకేదఫాలో 55 పాఠశాలల నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్

పరిపాలన అనుమతులు జారీ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు

రాష్ట్రంలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు

ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## 3 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ







ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు..

మార్చి 20న పోలింగ్

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీదా రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు

## ఎస్ఎల్బీసీ టన్నెల్ నుంచి ఒక మృతదేహం వెలికితీత

గత నెల 22న ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం

8 మంది గల్లంతు

16 రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



# బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సమాచారమంతా అధికారికంగా సేకరించినదే. ఇంటి యజమాని ధ్రువీకరణ కూడా తీసుకున్నాం. ఈ సర్వేలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్టు తేలింది. గతంలో కేసీఆర్ హయాంలో చేసిన సర్వేలో బీసీల జనాభా 51శాతమే లెక్కించారు. ఇప్పుడు 5.33 శాతం పెరిగింది. కేసీఆర్ సర్వేలో అగ్రకులాల జనాభా శాతం 21శాతం ఉన్నట్టు చెబితే.. మా సర్వేలో 15.28 శాతమేనని తేలింది. ప్రతి కోణంలో సర్వే చేసి గణాంకాలను క్రోడీకరించాం.



**అసెంబ్లీలో బిల్లు పెడతాం..:**

బీసీలకు ఇచ్చిన హామీలో భాగంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. త్వరలో అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం. పార్లమెంటులో ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన వెంటనే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి ఇవ్వడమంటే మోదీ మెడ మీద కత్తిపెట్టినట్టే. కచ్చితంగా మన డిమాండ్‌ను ఆమోదించాల్సిందే. బీసీల కోసం ప్రజాప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారనే భయం ప్రతిపక్ష పార్టీలకు పట్టుకుంది. బీసీలు ఎదిగితే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు ఆదిలోనే అడ్డుకునే కుట్ర చేస్తున్నాయి. ఈ పరిస్థితులను బీసీలంతా గుర్తించాలి.

**నన్ను ఎప్పుడైనా కలవచ్చు..:**

తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతోనే ముఖ్యమంత్రి అయ్యాను. ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా కర్తవ్యం. అందుకోసం 24గంటలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే పెద్ద సాహసంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడైనా నన్ను కలవచ్చు. మీ సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చి.. వాటిని పరిష్కరింపజేసుకునే బాధ్యత మీదే. తెలంగాణ సాధన కోసం పోరాడిన పద్మశాలి ముద్దు బిడ్డ కొండాలక్ష్మణ్ బాపూజీని పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

**ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే..**

కేంద్రంతో మాట్లాడి 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేశాం. దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతాం. టైగర్ నరేంద్రకు యూపీఏ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇస్తే... ధృతరాష్ట్రుడి కౌగిలి మాదిరిగా కేసీఆర్ ఆయనను ఖతం చేశారు. కులవృత్తిపై ఆధారపడిన పద్మశాలీలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను మహిళలు కట్టుకోలేదు. అవి పొలాల దగ్గర కట్టడానికే పనికి వచ్చాయి. అందుకే అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ ఆపివేశాం. మహిళా సంఘాల్లోని వారికి మంచి చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. రూ.600 కోట్ల విలువైన 1.30 కోట్ల చీరల ఆర్డర్లను నేతన్నలకు ఇస్తున్నాం. తెలంగాణ పద్మశాలీలు ఇతర రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోటితో షోలాపూర్‌లో పద్మశాలీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మించేందుకు సహకరిస్తాం.." అని సీఎం రేవంత్ వెల్లడించారు.

**చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ బడ్జెట్‌లోనే వారి రుణాలను మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజల కష్టాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పద్మశాలీలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు వినూత్న పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు.

**మగ్గంపై చీర నేసిన సీఎం**

సీఎం రేవంత్ తొలుత ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. అక్కడ సిద్ధం చేసిన చేనేత మగ్గంపై చీర నేశారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వరం గల్ మేయర్ గుండు సుధా రాణి, అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ పద్మశాలి సంఘం ప్రతినిధులు అంబటి శ్రీనివాస్, మురళీధర్, గడ్డం జగన్నా థం, కన్నెగట్ల స్వామి, టీపీసీసీ చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, మచ్చ వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ నుంచి ఒక మృతదేహం వెలికితీత

నాగర్ కర్నూల్: ఎస్ఎల్బీసీ టన్నెల్ నుంచి ఒక మృతదేహాన్ని ఎట్టకేలకు వెలికితీశారు. మృతదేహాన్ని రెస్క్యూ టీమ్ వెలికి తీసుకొచ్చింది. అతన్ని టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ గా అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో 16వ రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇంకా 8 మంది కార్మికుల జాడ తెలియలేదు. ఇక రోబోల వినియోగం తప్పదని అధికారులు అంటున్నారు. ఆ మేరకు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. చివరి 50 మీటర్ల ప్రాంతంలో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. టెన్నెల్ ఎండ్ పాయింట్‌లో కీలక స్పాట్స్‌ను గుర్తించారు. కీలకమైన స్పాట్స్‌లో ర్యాట్ హెూల్ మైనర్ల తవ్వకాలు చేపట్టారు. రెస్క్యూలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటున్నారు. జీపీఆర్, కేడవర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాలలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం తవ్వకాలు ముమ్మరం చేశారు. టీబీఎంకు ఎడమ పక్కన కనిపించిన ఓ మృతదేహానికి సంబంధించిన చేయిని గుర్తించారు. మృతదేహం పూర్తిగా కాంక్రీట్‌లో కూరుకుపోయింది. డ్రిల్లింగ్ ద్వారానే బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ఆ మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చింది రెస్క్యూ టీమ్. కాగా, గత నెల 22వ తేదీన శైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్బీసీ) సొరంగం తవ్వకం పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సొరంగం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలడంలో 8 మంది లోపలే చిక్కుకుపోయారు. అందులో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారు. వారిని కాపాడేందుకు అధికారులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. కానీ బాధితులు సొరంగంలో 14 కిలోమీటర్ల లోపల శిథిలాలు, బురదలో చిక్కుకుపోవడంతో బయటికి తీసుకురావడం కష్టంగా మారింది.

## 3 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ

ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 20న ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. పొత్తులో భాగంగా జనసేనకు 1, బీజేపీకి 1 ఎమ్మెల్సీ స్థానం కేటాయించిన టీడీపీ... మిగిలిన 3 ఎమ్మెల్సీ స్థానాలకు నేడు అభ్యర్థులను ప్రకటించింది. బీదా రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడులను టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. ఈ ముగ్గురిలో ఒకరు ఎస్సీ కాగా, ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. శ్రీకాకుళంకు చెందిన కావలి గ్రీష్మ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె. ఇక, నెల్లూరు జిల్లాకు చెందిన బీదా రవిచంద్ర మొదటి నుంచి పార్టీకి నమ్మకంగా సేవలందిస్తున్నారు. బీటీ నాయుడు కర్నూలు జిల్లా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత. కాగా, జనసేన నుంచి నాగబాబు ఎమ్మెల్సీ అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆయన ఇటీవలే నామినేషన్ కూడా వేశారు.

## ఎన్నిక ఏకగ్రీవమే!

హైదరాబాద్: శాసనమండలికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది. అనూహ్య పరిణామాలు జరిగితే తప్ప ఎన్నిక జరిగే ఐదు స్థానాల్లో కాంగ్రెస్ మూడు, సీపీఐ, బీఆర్ఎస్ చెరో స్థానాన్ని దక్కించుకోనున్నాయి. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా అధికార కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాల్లో అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌లను అభ్యర్థులుగా ప్రకటించడంతోపాటు మరో స్థానాన్ని మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరు ఖరారైంది. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యం బరిలో ఉన్నారు. ప్రస్తుతం శాసనమండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్‌ల పదవీకాలం ఈ నెల 29న ముగుస్తోంది. ఖాళీ అవుతున్న ఈ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నిక కోసం ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారంతో ఈ గడువు ముగుస్తోంది. 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణకు గడువు ఉంది. ఎన్నిక అనివార్యమయ్యే పక్షంలో ఈ నెల 20న పోలింగ్ జరుగుతుంది. కానీ ఖాళీ అవుతున్న ఐదు స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు మాత్రమే బరిలోకి దిగుతుండటంతో ఎన్నిక ఏకగ్రీవమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## రెండో విడత బడ్జెట్ సమావేశాలు నేటి నుంచే

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఇవి ఏప్రిల్ 4వ తేదీ దాకా కొనసాగుతాయి. పలు శాఖలకు గ్రాంట్లు, డిమాండ్లకు అమో దం, మణిపూర్ బడ్జెట్ ఆమోదం, అత్యంత కీలకమైన వక్ఫ్ (సవరణ) ను ఆమోదంపై ఈ సమావేశాల్లో కేంద్రం దృష్టి సారించనుంది. వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇప్పటికే నివేదిక అందజేసింది. దాన్ని వీలైనంత త్వరగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం చిత్తశుద్ధితో ఉన్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు పార్లమెంట్ ఆమోదం కోరుతూ కేంద్రం హెూం మంత్రి అమిత్ షా తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. మణిపూర్ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడతారు. రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడివేడీగా సాగే అవకాశాలున్నాయి. వక్ఫ్ బిల్లుతో పాటు మణిపూర్ హింసాకాండ, లోక్‌సభ నియోజకవర్గాల పుర్విభజన, అమెరికా సుంకాల పెంపు తదితరాలపై మోదీ సర్కారును గట్టిగా నిలదీయాలని విపక్షాలు భావిస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తమకు చేటు చేస్తుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తుండటం తెలిసిందే. 1971 నాటి జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన జరగాలని తమిళనాడు సీఎం స్టాలిన్ డిమాండ్ చేస్తున్నారు. దీన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని డీఎంకే ఎంపీలను ఆయన ఆదివారం ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన పుర్విభజనను, తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దడాన్ని పార్లమెంటులో గట్టిగా వ్యతిరేకించాలని నిర్ణయించారు.





## 3 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ

**ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు.. మార్చి 20న పోలింగ్**

**టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీదా రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు**

ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 20న ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. పొత్తులో భాగంగా జనసేనకు 1, బీజేపీకి 1 ఎమ్మెల్సీ స్థానం కేటాయించిన టీడీపీ... మిగిలిన 3 ఎమ్మెల్సీ స్థానాలకు నేడు అభ్యర్థులను ప్రకటించింది. బీదా రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడులను టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. ఈ ముగ్గురిలో ఒకరు ఎస్సీ కాగా, ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. శ్రీకాకుళంకు చెందిన కావలి గ్రీష్మ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె. ఇక, నెల్లూరు జిల్లాకు చెందిన బీదా రవిచంద్ర మొదటి నుంచి పార్టీకి నమ్మకంగా సేవలందిస్తున్నారు. బీటీ నాయుడు కర్నూలు జిల్లా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత. కాగా, జనసేన నుంచి నాగబాబు ఎమ్మెల్సీ అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆయన ఇటీవలే నామినేషన్ కూడా వేశారు.

## సమీకృత గురుకులాలకు రూ. 11,000 కోట్లు

**ఒకేదఫాలో 55 పాఠశాలల నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్**

**పరిపాలన అనుమతులు జారీ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు**

**రాష్ట్రంలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు**

**ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు**

**అన్ని వర్గాల పిల్లలూ ఒకే గొడుగు కిందకు**

**విశాలమైన ఆవరణ.. అంతర్జాతీయ ప్రమాణాలు**

**డిజిటల్ విద్య, ల్యాబ్‌లు, యాంఫీథియేటర్ ఉండేలా డిజైన్**

**ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్: యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు (వైఐఐఆర్ఎస్)...రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రాజెక్టు. అన్ని వర్గాల పిల్లలను ఒకే గొడుగు కిందకు తెచ్చి విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో దీనికి అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగా తొలివిడత ఒకే దఫాలో 55 సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ.. మొత్తం 55 పాఠశాలలు నిర్మించేందుకు రూ.11 వేల కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేవిడత ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం ఇదే ప్రథమం. కాగా గురుకులాల నిర్మాణానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

**కుల, మత వైషమ్యాలు తొలగిపోయేలా..**

కుల, మత వైషమ్యాలు తొలగిపోవాలని, అందరికీ సమాన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సమీకృత గురుకుల పాఠశాలల క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం నాలుగు గురుకుల పాఠశాలలుంటాయి. డిమాండ్‌కు అనుగుణంగా కొన్నిచోట్ల జనరల్ గురుకుల పాఠశాలలకు సైతం అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఒక్కో సమీకృత గురుకుల పాఠశాల క్యాంపస్ విస్తీర్ణం గరిష్టంగా 25 ఎకరాల్లో ఉంటుంది. ఈ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్యను అందించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, మినీ యాంఫీథియేటర్, క్రీడా ప్రాంగణం ఉండేలా డిజైన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

# మనమే చాంపియన్స్

**చతుష్టయాన్ని ఎదుర్కోవడంలో మళ్లీ**

**తడబడిన కివీస్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఛేదనలో రోహిత్ శర్మ దూకుడైన ఆరంభం లక్ష్యాన్ని అందుకునేందుకు తగిన పునాది వేసింది. మధ్యలో కొద్దిసేపు కివీస్ స్పిన్నర్లూ ప్రభావం చూపడంతో 17 పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోయి కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో సమర్థమైన బ్యాటింగ్ లైనప్ తడబడకుండా టీమ్‌ను విజయతీరం చేర్చింది. క్రికెట్‌లో 'మంచి బాలురు'వంటి న్యూజిలాండ్ టీమ్ మరోసారి 'పోరాడి ఓడిన' ముద్రతోనే నిరాశగా నిష్క్రమించింది.**

దుబాయ్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025ను భారత్ సొంతం చేసుకుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లతో పాటు సెమీఫైనల్, ఫైనల్ కలిపి ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఓటమి లేకుండా జట్టు టైటిల్ గెలుచుకుంది. దుబాయ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. గతంలో భారత్ 2002, 2013లలో కూడా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెల్చుకుంది. ఫైనల్లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. డరైల్ మిచెల్ (101 బంతుల్లో 63బీ 3 ఫోర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (40 బంతుల్లో 53 నాటౌట్‌బీ 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (83 బంతుల్లో 76బీ 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగగా... శ్రేయస్ అయ్యర్ (62 బంతుల్లో 48బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టోర్నీ మొత్తంలో 263 పరుగులు చేసి 3 వికెట్లు తీసిన న్యూజిలాండ్ ప్లేయర్ రచిన్ రవీంద్ర 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు గెల్చుకున్నాడు.

**మిచెల్ హాఫ్ సెంచరీ...**

కివీస్ ఇన్నింగ్స్‌ను రచిన్ రవీంద్ర (29 బంతుల్లో 37బీ 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా మొదలు పెట్టాడు. పాండ్యా ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను షమీ ఓవర్లో మరో రెండు ఫోర్లు బాదాడు. దాంతో ఆరో ఓవర్లోనే భారత్ స్పిన్నర్ వరుణ్‌ను బౌలింగ్‌కు దింపింది. విల్ యంగ్ (23 బంతుల్లో 15బీ 2 ఫోర్లు)ను అవుట్ చేసి అతను ఓపెనింగ్ జోడీని విడదీశాడు. 10 ఓవర్లలో కివీస్ స్కోరు 69 పరుగులకు చేరింది. తన తొలి బంతికే రచిన్‌ను బౌల్డ్ చేసిన కుల్దీప్, తన రెండో ఓవర్లో విలియమ్సన్ (14 బంతుల్లో 11బీ 1 ఫోర్)ను పెవిలియన్ పంపించి ప్రత్య ర్థిని దెబ్బ కొట్టాడు. లాథమ్ (30 బంతుల్లో 14) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ (52 బంతుల్లో 34బీ 2 ఫోర్లు, 1 సిక్స్) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే స్పిన్నర్లను ఎదుర్కోవడంలో బ్యాటర్లు బాగా ఇబ్బంది పడటంతో పరుగులు నెమ్మదిగా వచ్చాయి. వరుసగా 81 బంతుల పాటు బౌండరీనే రాలేదు. ఎట్టకేలకు 91 బంతుల్లో మిచెల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఒక వైపు తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయినా... ఆఖర్లో బ్రేస్‌వెల్ వేగంగా ఆడటంతో జట్టు స్కోరు 250 పరుగులు దాటింది. చివరి 10 ఓవర్లలో కివీస్ 79 పరుగులు చేసింది. నలుగురు భారత స్పిన్నర్లు కలిపి 38 ఓవర్లలో 144 పరుగులిచ్చి 5 వికెట్లు తీయగా... ఇద్దరు పేసర్లు 12 ఓవర్లలో 104 పరుగులిచ్చి ఒకే వికెట్ తీయడం మన స్పిన్నర్ల ప్రభావాన్ని చూపించింది. ఇన్నింగ్స్ రెండో బంతికే సిక్స్‌తో మొదలు పెట్టిన రోహిత్ తన ఇన్నింగ్స్ ఆసాంతం దూకుడుగా ఆడాడు. నాథన్ స్మిత్ ఓవర్లో అతను 2 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. మరో ఎండ్‌లో శుబ్‌మన్ గిల్ (50 బంతుల్లో 31బీ 1 సిక్స్) పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించాడు. 10 ఓవర్లలో స్కోరు 64 పరుగులు కాగా, 41 బంతుల్లోనే రోహిత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఎట్టకేలకు శతక భాగస్వామ్యం తర్వాత గిల్ అవుట్ కావడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆపై మరో 17 పరుగుల తేడాతో రెండు కీలక వికెట్లు తీసి కివీస్ పైచేయి సాధించింది. బ్రేస్‌వెల్ తొలి బంతికి కోహ్లి (1) వికెట్ల ముందు దొరికిపోగా, రోహిత్ భారీ షాట్‌కు ప్రయత్నించి స్టంపౌటయ్యాడు. ఈ దశలో అయ్యర్, అక్షర్ పటేల్ (40 బంతుల్లో 29బీ 1 ఫోర్, 1 సిక్స్) కలిసి చక్కటి సమన్వయంతో జాగ్రత్తగా ఆడుతూ మళ్లీ ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే వీరిద్దరిని తక్కువ వ్యవధిలో వెనక్కి పంపడంతో కివీస్ బృందంలో ఆశలు రేగాయి. అయితే కేఎల్ రాహుల్ (33 బంతుల్లో 34 నాటౌట్‌బీ 1 ఫోర్, 1 సిక్స్) ముందుండి నడిపిస్తూ జట్టును విజయం దిశగా తీసుకెళ్లాడు. 68 బంతుల్లో 69 పరుగులు చేయాల్సిన స్థితిలో బరిలోకి దిగిన రాహుల్‌కు హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 18బీ 1 ఫోర్, 1 సిక్స్) సహకరించాడు. 49వ ఓవర్ చివరి బంతిని జడేజా (6 బంతుల్లో 9 నాటౌట్‌బీ 1 ఫోర్) డీప్‌స్క్వేర్ లెగ్ దిశగా ఫోర్ కొట్టడంతో భారత్ విజయాన్ని పూర్తి చేసుకుంది.



## కాలనీ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా:ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా,వార్త మిర్రర్,మార్చ్ 09:తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణ రెడ్డి నగర్ (బంజారా కాలనీ) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల వారీగా అభివృద్ధికి అన్ని ప్రణాళికలు సిద్ధం చేశాము అని ఆయన అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ ప్రతినిధి పద్మరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్,నాయకులు జయ కృష్ణ ,సంపత్ కుమార్ కృష్ణారెడ్డి నగర్ కాలనీ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్,ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్,వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు

సంస్థాన్ నారాయణపుర్, మార్చి 09(వార్త మిర్రర్ నెట్వర్క్ ఇన్చార్జి ఉప్పల వెంకటేష్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండలం కేంద్రానికి చెందిన 2000-2001 జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి బ్యాచ్ మిత్రులు కలిసి తోటి స్నేహితురాలు సునీత భర్త అకాల మరణించిన విషయాన్ని గమనించి వారి కుటుంబాన్ని పరామర్శించి 57,600 రూపాయలు అందించడం జరిగింది,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న నాటి స్నేహాన్ని మరవలేక చదువుకున్న విద్యార్థులు మా పాఠశాలకు సంబంధించిన ఏ ఒక్కరికి ఏలాంటి ఇబ్బందులు జరిగిన మా సహాయ సహకారలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో రమణ, మహేశ్వరి, జయ కిషోర్, రాజు, మురళి, బాలరాజు,కిరణ్, బాలకృష్ణ, మహేష్ శంకర్ వెంకటేష్ రవి,శ్రవణ్, రమేష్, ధనంజయ్, ప్రతాప్, భాను, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## కోరుట్ల మోటార్ సైకిల్ వర్క్ షాప్ సొసైటీ రెండవసారి ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షులు గా కటుకం గోవర్ధన్.

కోరుట్ల (వార్త మిర్రర్) మార్చి 9. కోరుట్ల పట్టణంలో ఈరోజు నిర్వహించిన కోరుట్ల మోటార్ సైకిల్ వర్క్ షాప్ సొసైటీ ఆధ్వర్యంలో ఎలక్షన్లు నిర్వహించగా, అధ్యక్షుడిగా కటుకం గోవర్ధన్,ఉపాధ్యక్షుడిగా వాజిద్, ప్రధాన కార్యదర్శిగా అల్లే రమేష్, సహాయ కార్యదర్శిగా వడ్లకొండ రమేష్, కోశాధికారిగా మండలోజు అంజయ్య, గా ఎన్నికైనారు, అధ్యక్షుడు కటకం గోవర్ధన్ మాట్లాడుతూ, తనను నమ్మి రెండవసారి అధ్యక్షుడిగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎల్లవేళలా సొసైటీకి అందుబాటులో ఉంటూ, సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని అని పేర్కొన్నారు,



## అధైర్య పడొద్దు అండగా నేనుంటా.

### - బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ మార్చ్ 9 వార్త మిర్రర్ ప్రతినిధి:- మండలం రాంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి శుక్ర వారం నాడు కోదాడ రాయచూరు జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్సు లో కల్వకుర్తి ప్రభుత్వ హాస్పిటల్ కీ తీసుకువెళ్లగా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ వెంకటయ్య చనిపోవడం జరిగింది.నిరుపేద కుటుంబనికి చెందిన వ్యక్తి మరణించడం తో రాంరెడ్డిపల్లి బిజెపి నాయకులు ఒర్సు ఆంజనేయులు సహకారంతో రాష్ట్ర బిజెపి నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డికి తెలియజేసిన వెంటనే స్పందించి నిరుపేద కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబనికి అండగా ఉంటామని అదే పడవద్దు అని భరోసనిస్తూ తక్షణ ఆర్థిక సహాయం గా రూ"5000 ఐదు వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండేల సుజీవన్ రెడ్డి, బి జంగారెడ్డి,సంగోజు బ్రహ్మచారి,సంగోజు వెంకటాస్వామి,గువ్వ రాజు, గువ్వ శీను,గువ్వా ఆంజనేయులు,గువ్వ నాగయ్య,సాకలి రవి, చంద్రయ్య,నాగయ్య, ఆంజనేయులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

**అడుగడుగునా అక్రమ నిర్మాణాలే... అయినా చోద్యం చూస్తున్న అధికార గణం**

**నోటీసుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న కలెక్షన్ కింగ్ చైన్మాన్ అన్ని ఆరోపణలు**





శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తూ కాలయాపన చేస్తున్నారని సర్కిల్ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే20 సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ,శ్రీ రామ్ నగర్ ఏ,బీ, సీ, బ్లాక్స్ శ్రీరామ్ నగర్, లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణదారుడు ఐదు నుండి ఆరంతస్తులు నిర్మాణం చేపడుతున్న




టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ ఏసిపి అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేయాలని కిందిస్థాయి సిబ్బందికి చెప్తుండడంతో ఇదే ఆసరాగా చేసుకున్న చైన్ మెన్ లు నోటీసుల జారీ పేరుతో భవన నిర్మాణదారులను వద్దనుండి అందిన కాడికి డబ్బులు దండుకుంటున్నట్లు సదర్ నిర్మాణదారులు పేర్కొనడం గమనార్హం. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు జారీ చేసే నోటీసులు చైన్ మెన్ కు బంగారు బాతు లా మారాయని పలువురు పేర్కొంటున్నారు. ఫిర్యాదు చేసిన, దినపత్రికలలో కథనాలు వచ్చిన అక్రమ నిర్మాణాలను చూసి చూడనట్లు వదిలేయాలంటూఫిర్యాదు చేసిన వారికిసలహాలు ఇస్తున్నాడు అంటే చైన్ మెన్ ఏ మేరకు డబ్బులు తీసుకున్నాడో అర్థమవుతుందనిఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. గత కొంత కాలం నుండిశ్రీ రామ్ నగర్, కొండాపూర్, రాఘవేంద్ర కాలనీ తదితర పరిధిలోని అక్రమ నిర్మాణం పై ఫిర్యాదు చేసిన నోటీసులు ఇచ్చాను, చర్యలు తీసుకుంటాను అంటూ కాలయాపన చేయడంలో ఆంతర్యం ఏమిటో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వలన అక్రమ నిర్మాణాల వద్ద చైన్మెన్ ఆడిందే అట పాడిందే పాటగా నడుస్తుందని ఇప్పటికైనా సంబంధిత విభాగం ఉన్నత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణపై చర్యలు తీసుకుంటార అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనాలు

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో ని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఒడిసి మరియు భరతనాట్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. బెంగళూరు నుండి విచ్చేసిన ప్రముఖ ఒడిసి గురువులు డాక్టర్ మనసి పాండ్య రఘునందన్ తన శిష్యురాలు శ్రీమతి సంహిత తో కలిసి ఒడిసి నృత్య ప్రదర్శనలో పంచదేవి కృతి, పల్లవి, బాటు, దుర్గ,మోక్షం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి వైదేహి సుభాష్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలో సకలగణాధిప, పుష్పాంజలి, నటేశకుతం, పిబరే రామ రసం, కీర్తన, తిల్లాన అంశాలను మనస్విని, మోక్షిత, మీనాక్షి, పావిక, నిహారిక, ఆవిజ్ఞ , హరిణి కార్తీక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



## ఘనంగా ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలు.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మియాపూర్ కి చెందిన ఓం ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలను యలమంచి ఉదయ్ కిరణ్ మరియు టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా మియాపూర్లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి మరియు శాలువా తో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మియాపూర్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ మరియు మియాపూర్ వైస్ ప్రెసిడెంట్ తాండ్ర రాంచందర్ గౌడ్, శరత్, వినోద్, వంశీ, కృష్ణ, ప్రవీణ్, నాగసాయి, సింహాచలం, చారి, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఆడపడుచుకు అండగా జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

### - మాజీ జెడ్పీటీసి దశరథ్ నాయక్ రూ"21000, తో పాటు పట్టుచీర కానుక

### - మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ 5000 ఆర్థిక సాయం

కల్వకుర్తి కడ్తాల్ మార్చ్ 9 వార్త మిర్రర్ ప్రతినిధి:- కడ్తాల్ మండల కేంద్రంలో పేదింటి వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం పరంపర కొనసాగుతూనే ఉంది. ట్రస్ట్ చైర్మెన్ జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదిగా పేదింటి వివాహానికి రూ"21000 వేయి నగదు ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను కానుకగా అందిస్తున్నారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కోషిక లక్ష్మమ్మ జగన్ దంపతుల కూతురు రోజా వివాహానికి రూ "21000 నగదు తో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను కానుకగా అందించారు. రోజా వివాహానికి కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ"5000 ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ రైతు సమితి అధ్యక్షులు నరసింహ మాజీ డైరెక్టర్ లయాక్ అలీ మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయకులు సిహెచ్ మహేష్ యాదయ్య జంగయ్య శ్రీను రాజు వెంకటేష్ శ్రీకాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

భువనగిరి నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, ఈ వివాహ వేడుకల్లో బిఆర్ఎస్ భువనగిరి మండల శాఖ అధ్యక్షులు జనగాం పాండు, మాజీ జెడ్పీటిసి సందెల సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, గొల్లపల్లి మాజీ సర్పంచ్ గోదా శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం అవమానించిన దుండగులను శిక్షించాలని డిమాండ్

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 9జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు గుర్రం రత్నాకర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూరు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చెప్పుల దండేసి అవమానించి యావత్ దళిత జాతి మనోభావాలను మానసికంగా దెబ్బతీసిన దుండగులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెలిమెలల మల్లేశం, లింగంపల్లి రాజేష్, బన్న సంజీవ్ మహమ్మద్ ఇంతియాజ్, ఆకు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని మూటపెల్లి, భూపతిపూర్ లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చెప్పుల దండేసి అవమానించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



## నిరుపేద యువతికి వివాహానికి ఆర్థిక చేయూత

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 9

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన బోగ లావణ్య - కీ శే లింగ మూర్తి కుమార్తె వివాహానికి సేవా సంఘ మరియు యువజన సంఘ నాయకులు 10,000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో సంఘ%శీ% అధ్యక్షులు తాటిపాముల విశ్వనాథం, సామల్ల సతీష్ ప్రధాన కార్యదర్శులు మామిడాల లక్ష్మి నారాయణ, ఆడెపు రాజీవ్ నేత, ఉపాధ్యక్షులు శ్రీరాముల సత్యనారాయణ, సిరిపురం రఘు, ఎలిగేటి సతీష్, సింగని సతీష్, కోశాధికారులు సిలివేరి నర్సయ్య, బొమ్మకంటి నవీన్, సంయుక్త కార్యదర్శులు అనుమల్ల చంద్ర తేజ, గంట్యాల ప్రవీణ్, అష్టమ వాడ పెద్దలు, పోపా సభ్యులు, గౌరవ సలహాదరులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

### - సీపీఎం జిల్లా నాయకులు ఆయూబ్

మిర్యాలగూడ, మార్చి 9:– (వార్త మిర్రర్) అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేసి,హామీలు అమలు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అయూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీతారాంపురంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. హామీలు అమలవుతాయని తమ కుటుంబానికి సంక్షేమ పథకం అందుతుందని పేద ప్రజలు ఎంతో ఆశపడ్డారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిర ఇండ్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈనెల 24 నుంచి 26 వరకు మిర్యాలగూడలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. పేదలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుంటోజు వీరాచారి, లక్ష్మీనారాయణ, గుంటోజు విష్ణు, గోవర్ధనా, భాస్కర్, నాగేశ్వరి, లింగమ్మ, రేణుక, అచ్చయ్య, పాషా, రషీద్, షఫీ, బాబా, రఫీ పాల్గొన్నారు.

## మిర్యాలగూడ రూరల్ సీఐగా పిఎన్డి ప్రసాద్



మిర్యాలగూడ, మార్చి 9:–( వార్త మిర్రర్)మిర్యాలగూడ రూరల్ పోలిసు సిఐగా పసుపులేటి నాగదుర్గాప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కె.వీరబాబు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో హైదరాబాద్ నగరం మొగల్ పుర స్టేషన్ ఎస్ హెచ్ఓగా పనిచేస్తున్న ప్రసాద్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐకి ఎస్ఐలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ప్రసాద్ గతంలో నల్లగొండ, మిర్యాలగూడలో ఒన్ టౌన్ సీఐగా కొన్నాళ్ళు పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలో ముఖ్యంగా ఇసుక, పిడిఎస్ బియ్యం, గంజాయి అక్రమ రవాణా పై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని, అణచివేస్తామని అన్నారు. తమ చుట్టుపక్కల జరిగే అక్రమాలపై ప్రజలు బాధ్యతగా సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందజేయాలన్నారు. అన్యాయం జరిగిన వారు ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా తమను సంప్రదించాలని కోరారు. ఆయా ప్రాంతాలలో అపరిచిత వ్యక్తులు, అనుమానాస్ప దంగా కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ లు కృష్ణయ్య, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఏ.సైదులు, ఏఎస్ఐ ఉమాపతి, సిబ్బంది వున్నారు.



## డాక్టర్ బోదనపు నటరాజ్ కు గురుజ్యోతి జాతీయ అవార్డు 2025

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 9

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన డా.బోదనపు నటరాజ్ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో పదమూడు సంవత్సరాలుగా ఉపన్యాసకులుగా పనిచేస్తూ ఎందరినో ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దుతున్నందుకు గాను మరియు కళారంగంలో ఇరవై నాలుగు సంవత్సరాల అనుభవంతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకొని, విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను పెంపొందిస్తు, సామాజిక సేవల్లో పాలుపంచుకుంటూ పలు అవార్డులు సొంతం చేసుకుంటున్నాడు. ఇలాంటి సేవలను గుర్తించి నటరాజ్ కు గ్లోబల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారు, విజయవాడలో అలంకార్ ఫైవ్ స్టార్ హొటల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో గురుజ్యోతి జాతీయ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు డాక్టర్ విప్పర్తి ఇసాక్, న్యూటన్, పాండు మరియు ప్రోగ్రాం ఆర్గనైజర్ కాసంశెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ అవార్డును అందుకున్న నటరాజ్ ను రష్మీధర తేజ కళాశాల యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ పీచర వేణుగోపాలరావు, ఉపన్యాసకులు ధనూరి శ్రీనివాస్, అజీజ్, తుమ్మనపల్లి రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, హాజియా మరియం,తదితర కళాకారులు నటరాజ్ ను అభినందించారు.



## రామాలయం ఆవరణలో కళ్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 9

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో శ్రీ సీతారామచంద్రాలయం ఆవరణలో దైవ కార్యక్రమాల కోసం, భక్తుల, గ్రామప్రజల అవసరార్థం రామాలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల ఆశీర్వచనంతో ఆంజనేయ స్వామి సంకల్పబలంతో ,భక్తుల , దాతల సహాయ సహకారాలతో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సమక్షంలో కళ్యాణ మండపం కొరకు ఆదివారం ఉదయం సుముహూర్తం సమయంలో ఆలయ అర్చకులు చెరుకు మధు శర్మ మంత్రోచ్ఛరణాల మధ్య భూమి పూజ చేయడం జరిగింది. ఇట్టి పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోల రాజు, ప్రధాన కార్యదర్శి సల్ల రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బోయిన నరేందర్, కోశాధికారి ఐలేని గంగారెడ్డి, కార్యవర్గ సభ్యులు రమాపతి రావు, కమిటీ సలహాదారులు మోహన్, మోహన్ రెడ్డి, రాజేశ్వర్ రావు, గ్రామపెద్దలు భీమారెడ్డి, గుర్రు మల్లారెడ్డి, యూత్ సభ్యులు భగత్ పటేల్, కమలాకర్, రవికిరణ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బేడ బుడగ జంగం జన సంఘం సమస్యలను పరిష్కరించాలి



శేరిలింగంపల్లి వార్త మిర్రర్: బేడ బుడగ జంగం జనసంగం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు కార్య వర్గ సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో గత 30 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కి అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా తీర్పించిన సుప్రీంకోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన కులగనన చేసి ఎస్సి వర్గీకరణ మూడు విభాగాలుగా చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, మంత్రివర్గ బృందానికి అదేవిధంగా ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీం అత్తర్ బృందానికి మా బేడ బుడగ జంగం జన సంఘం తరఫున శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. గత ఆగస్టు నెలలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా తీర్పిస్తూ కొన్ని ముఖ్యమైన సూచనలు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయడం జరిగింది. అన్ని రంగాలలో వెనుకబడ్డ కులాల వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రిజర్వేషన్ శాతం పెంచాలని సుప్రీంకోర్టు రాష్ట్రాలకు తెలియజేస్తూ. అదేవిధంగా సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా విద్య పరంగా ఉద్యోగ పరంగా ఉపాధిపరంగా జనాభా ధమాసం ప్రకారం కాకుండా అన్ని రంగాలలో వెనకబడ్డ కులాల వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాలలో వారికి అవకాశం కల్పించాలని తెలియజేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు 1 లో 1,70,000 పైన ఉన్న కులాల వారిని గ్రూప్ వన్ లో చేరుస్తూ 1% రిజర్వేషన్ కేటాయించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విషయం గుర్తు చేయదలచుకున్నాం గత అసెంబ్లీ ఎలక్షన్లో చేవెళ్ల సభలో ఎస్సీలకు 15 శాతం ఉన్న రిజర్వేషన్ శాతాన్ని. 18 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు వెంటనే మరో మూడు శాతం రిజర్వేషన్ పెంచి. సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనని పాటిస్తూ గ్రూప్.%ఖ% లో ఉన్న 15 కులాలకు మరో 1% రిజర్వేషన్ శాతాన్ని పెంచి మొత్తం రెండు శాతం రిజర్వేషన్ శాతం పెంచాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరుతున్నాము. అదేవిధంగా ఏ కేటగిరీలో ఉన్న 15 కులాలు అన్ని రంగాలలో వెనుకబడి పోయారు గనుక వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 15 కులాల్లో మేజర్ కులమైన బేడ బుడగ జంగాల కులానికి సంబంధించిన వారికి చైర్మన్ పదవి ఇచ్చి పదివేల కోట్ల రూపాయలు నిధి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరుతున్నాము. అదేవిధంగా స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఏ పార్టీ మా బేడ బుడగ జంగాల కులానికి రాజకీయ అవకాశం కల్పించలేదు త్వరలో ఆరు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్న సందర్భంగా మా బేడ బుడగ జంగాలకు ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించాల్సిందిగా ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాం. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ మా బేడ బుడగ జంగాలు 80 శాతం ఇల్లు లేక పూరి గుడిసెలలో నివసిస్తున్నారు త్వరలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టడానికి సిద్ధంగా ఉంది కాబట్టి మా బేడ బుడగ జంగాలకు ఇందిరమ్మ ఇండ్లలో 20 శాతం. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మరో 20 శాతం మొత్తం 40 శాతం మా బేడ బుడగ జంగాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరుతున్నాము. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి వివిధ పనుల విషయంలో హైదరాబాద్ కు వచ్చి రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ ప్లాట్ ఫారాల పైన నాన అవస్థలు పడుతున్నారు. వెంటనే హైదరాబాదులో 1000 గజాల స్థలం కేటాయించి కమ్యూనిటీ హాలు నిర్మించి ఇవ్వాల్సిందిగా ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాము. అదేవిధంగా రాష్ట్ర రాజధానితో పాటు జిల్లా కేంద్రాలలో మా కులం తరఫున సమావేశాలు సభలు పెళ్లిళ్లు పేరంటాలు చేసుకోవడానికి అన్ని రంగాలలో వెనుకబడిపోయాము కనుక ఉమ్మడి 10 జిల్లాల్లో ప్రతి జిల్లాకు 1000 గజాల స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ లో నిర్మించి ఇవ్వాల్సిందిగా ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాము. ఇంతవరకు ఎస్సీ వర్గీకరణ విషయంలో గాని రాష్ట్రవ్యాప్తంగా మా బేడ బుడగ జంగాల సమస్యల పైన రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని వివిధ శాఖ మంత్రులని కలిసి ముఖ్యమంత్రిని కల్పించే ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్నోసార్లు వేడుకోవడం జరిగింది కానీ ఇంతవరకు మాకు అవకాశం కల్పించలేదు అందుకే ఈ ప్రెస్ మీట్ ద్వారా పైన తెలిపిన డిమాండ్లలో ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా. బేడ బుడగ జంగం బి జన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని తెలిపారు.

# ఘనంగా ఇంజాపూర్ బ్లాక్ బోర్డ్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు


ఎల్బీనగర్,9 మార్చి: ఇంజాపూర్ బ్లాక్ బోర్డ్ పబ్లిక్ స్కూల్ ఉడాన్ రైస్ ఫ్లై , కాంక్యూర్ కాన్సెప్ట్ తో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఎంతగానో అలరింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ హరిత ధనరాజ్ గౌడ్ హాజరై వార్షికోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లాక్ బోర్డ్ పబ్లిక్ స్కూల్ యజమాన్యం ప్రవళిక – రామ్లాల్ ఐఐటీలో చదువుకొని ఉద్యోగాలను కూడా వదులుకొని పిల్లల యొక్క భవిష్యత్తు కొరకు చక్కటి విద్యను అందిస్తున్నందుకు అభినందించారు. అంతర్జాతీయ ప్రో కబడ్డీ రిఫరీ వి శ్రీను నాయక్ మాట్లాడుతూ పిల్లల యొక్క చదువులతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. యజమాన్యం సహకరిస్తే మా తరఫున కూడా మేము పిల్లలలో క్రీడా నైపుణ్యం పెంచడం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి సహకరిస్తామని సూచించారు. పిల్లలు వివిధ క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, ఎన్. రవికుమార్, సోషల్ వెల్ఫేర్ స్కూల్– కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ హుస్సేన్,డైరెక్టర్లు ఎన్. రామలాల్, ఎన్. ప్రవల్లిక మాట్లాడుతూ,మా పిల్లలు విద్యా రంగంలో సాంస్కృతిక వాళ్లతో పాటు కళా మరియు క్రీడా రంగాల్లోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. 'ఉడాన్' అనే కాన్సెప్ట్ ద్వారా మనం పిల్లలకు కలలు కని, వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు.



# గోవుతో గృహప్రవేశం ఎందుకు చేయిస్తారో తెలుసా?

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 9

జీవితంలో సొంత ఇల్లు కట్టుకోవాలనే కోరిక ప్రతి ఒక్కరికి ఉంటుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి ఎన్ని కష్టాలను పడటానికి అయినా సిద్ధపడతారు. ఊరు సొంత ఊరు అని చెప్పుకోవాలంటే సొంత ఇల్లు ఉండాలని భావిస్తారు. లేదంటే ఆ ఊరికి తాము పరాయివాళ్ళం అనే భావన కలుగుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరు సొంత ఇల్లు ఉండాలని అంత ప్రాధాన్యత ఇస్తూ ఉంటారు. ఇల్లు కట్టుకున్నాక బందులను పిలిచి 'గృహప్రవేశం' చేస్తుంటారు. ఆ సమయంలో కొత్త ఇంటిలోకి ముందుగా గోమాతను తీసుకువెళ్లి మొత్తం ఇల్లంతా తిప్పుతారు. ఆ తర్వాతే ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు ఇంటిలోకి వెళతారు. ఈ ఆచారం అనాదిగా వస్తుంది. ఇక ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరూ తమ బంధు మిత్రులను ఆహ్వానించి 'గృహప్రవేశం' చేస్తుంటారు. గృహ ప్రవేశానికి ముందు ఆ కొత్త ఇంట్లో గోమాతను తిప్పడం మన ఆచారంగా వస్తోంది. గోవు సకలదేవతా స్వరూపంగా చెప్పబడింది. గోవుతో పాటే సమస్త దేవతలు వస్తారని శాస్త్రం చెబుతోంది.అందువలన నూతన గృహాల్లోకి గోవును ప్రవేశ పెట్టడాన్ని శుభసూచకంగా విశ్వసిస్తుంటారు. నూతన గృహంలో గోవు మూత్రం ... పేడ వేసినట్లయితే మరింత శుభకరంగా భావిస్తుంటారు. అయితే పట్టణాల్లో అపార్ట్ మెంట్ల సంస్కృతి ఎక్కువగా కనిపిస్తూ వుంటుంది. అందువలన బహుళ అంతస్తులు కలిగిన ఈ భవనాల్లోకి ఆవును తీసుకు రావడం కుదరదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలనే విషయంగా చాలా మందికి సందేహం కలుగుతుంటుంది. లక్షలు ఖర్చుపెట్టినా ఆవు అడుగు పెట్టకుండా అయిందేననే అసంతృప్తి కలుగుతుంటుంది. అయితే శాస్త్రం ఇందుకు చాలా స్పష్టమైన సమాధానం చెబుతోంది.తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి



# విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా పదవ తరగతి పరీక్షలు రాయాలి.


**విద్యార్థుల దాగి ఉన్న సృజనాత్మకతను వెతికి తీయడం కోసమే టాలెంట్ టెస్ట్..**

**ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు**

**దాసరి ప్రకాష్, తిగుళ్ళ శ్రీనివాస్**



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 09మానసిక ఒత్తిడి లేకుండా పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను రాయాలని విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మకమైన వ్యక్తి తీయడం కోసం ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులుబి దాసరి ప్రకాష్,తిగుళ్ల శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో ని నలంద డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేయడం జరిగింది.అనంతరం విద్యార్థులతో



మాట్లాడుతూ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలలో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో సమస్యలే కాకుండా విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మక తీయడం కోసం నిరంతరం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,త్వరలో రాబోయే పదవ తరగతి పరీక్షలను ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ధైర్యంగా రాసి ఫలితాలు సాధించాలని తల్లిదండ్రుల కళల్ని నిలబెట్టాలని అన్నారు. విద్యార్థులు ముందుగా భయాన్ని విడిచిపెట్టి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ నిర్వహించడ జరుగుతుంది, చదివే అన్నింటికీ మూలమని ఉన్నతంగా చదివి జీవితంలో మంచి స్థానంలో ఉండాలని అన్నారు. ఉన్న తక్కువ సమయాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవాలని సమయాన్ని వృధా చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ చేసే కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, ఎస్ఎఫ్ఐ నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టులో 300 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరై పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుల రుద్రగోని మధు, దోనూరి శ్రావణ గర్ల్స్ కమిటీ నాయకురాలు దివ్య ప్రవళిక ప్రసన్న నయకులు వరుణ్ సాగర్ వెంకట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు




## సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పుస్తక ప్రదర్శనలో డాక్టర్ లక్కరాజు నిర్మల పుస్తకావిష్కరణ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 9... తార్నాక నాగార్జున నగర్ కాలనీ నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సం యుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో డాక్టర్ లక్కరాజు నిర్మల తన రచనలను ప్రదర్శించారు.



## వనస్థలిపురం ఏ టైప్స్ క్వాటర్స్ లోని శ్రీ పోచమ్మ ఆలయంలో 2 వ రోజు ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు

### - ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు భవాని రాజశేఖర్ విజయ, భవాని ప్రమోద్ కుమార్ అనిత దంపతులు



ఎల్బీనగర్, 09 మార్చి : వనస్థలిపురం డివిజన్ హుడా కాలనీ ఏ టైప్ క్వార్టర్స్ లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ దాతలు భవాని రాజశేఖర్ విజయ, భవాని ప్రమోద్ కుమార్ అనిత దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం పండితుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు యాగశాలలో ఆరాధన చండీ హవనం, ధ్వజస్తంభ ఆరాధన, దాన్యాదివాసం, మంగళ హారతి, మంత్రపుష్పం, ఆతదితర పూజ మహోత్సవాలు భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గాండ్ల ఆనంద్ రాజ్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎన్. రాములు, ఆలయ కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, కే. సతీష్ కుమార్ గుప్తా, ఏ. నాగేష్, జి.వెంకట్, ఆలయ పూజారులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## శాసనమండలి అభ్యర్థిగా కె శంకర్ నాయక్ నియామకం పట్ల పలువురి హర్షం



మిర్యాలగూడ మార్చి 9:- (వార్త మిర్రర్) నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేతవత్ శంకర్ నాయక్ ను శాసనసభ కోటా నుండి జరిగే శాసనమండలి సభ్యుల పోటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిర్ణయాన్ని ఎఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారని టిపిసీసీకి పంపిన లేఖలో ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి కె సి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్సీ నుండి అద్దంకి దయాకర్, బిసి నుండి సిని నటి విజయశాంతి లను అభ్యర్థులుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఒక స్థానాన్ని సిపిఐ అధిష్ఠానం కేటాయిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని దామరచర్లలోనీ డిలావర్ పూర్ గ్రామపంచాయతీ నవంబర్ 15, 1972లో జన్మించారు. ఆయనతండ్రి వీర్యనాయక్ ఆ గ్రామ సర్పంచ్ గా పని చేశారు. శంకర్ నాయక్ యువజన కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయాల్లో అడుగు పెట్టి 1998 నుండి 2001 వరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా,2001 నుండి2005 వరకు ఉమ్మడి దామరచర్ల మండల జెడ్పిటీసీగా, 2006 నుండీ 2011 వరకు దామరచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా, 2011 నుండి 2014 వరకు దామరచర్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, 2016 నుండీ 2019 వరకు మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, 2019 నుండి నేటి వరకు నల్లగొండ డిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వివాద రహితంగా ఉంటూ రాజకీయ గురువు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆశీస్సులతో శంకర్ నాయక్ ముందుకు సాగుతున్నారు. ఆయన ఎంపిక నియోజకవర్గం గిరిజనులు సంబరాలు జరుపుకున్నారు.



## తార్నాక సాహిత్య సంబరాలు

సికింద్రాబాద్,వార్త మిర్రర్ మార్చి 9....సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యునిటీ హాల్లో తార్నాక సాహిత్య సంబరాలను ఘనంగా నిర్వహించారు. దీన్ని ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ టి. తిరుపతిరావు జ్యోతి ప్రజ్వలన చేసి సాహిత్య సంబరానలు ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని నగరంలోనే తొలిసారిగా నిర్వహించిన తార్నాక సాహిత్య సంబరాలు కార్యక్రమంలో ప్రాంతీయ తార్నాక కవులు, రచయితలు, పబ్లిషర్స్ ఇందులో పాల్గొన్నారు. వారు రాసిన పుస్తకాలతో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజాన్ని జాగృతం చేయడంలో సాహిత్యం ప్రాముఖ్యత, గొప్పతనాన్ని వివరించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కొ కానీ మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రసిడెంట్ జలంధర్ రెడ్డి, ఓం ప్రకాష్, డా. పి. మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి, టివి రావు. వినోద్ రెడ్డి, ధనలక్ష్మీ, రయితలు ఆనందే నాగరాజు, రఘుకుమార్ తదితరులున్నారు.

# ఆర్థిక సంక్షోభం సాకుతో కార్మికుల సమస్యలను విస్మరించడం సిగ్గుచేటు

### -సీఐటీయూ నాయకులు -




మందమర్రి మార్చి 9,: వార్త మిర్రర్ ప్రతినిధి సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించా ల్సింది పోయి ఆర్థిక సంక్షోభం సాకుతో సమస్యలను విస్మరించడం సిగ్గుచేటని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి మంద నరసింహారావు లు విమర్శించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి గత సం,, నవంబర్ 28 న జరిగిన స్ట్రక్చర్డ్ సమావేశాల తీర్మానాలను అమలు చేయాలని, సొంతింటి పథకం, పేర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలనీ, మారు పేర్ల మార్పు పై ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సిఎండితో ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ సమావేశాలలో యాజమాన్యంతో గుర్తింపు సంఘం కి మధ్య జరిగిన చర్చల్లో పలు రకాల సమస్యలను గుర్తింపు సంఘం పరిష్కరించాలని కోరగా యాజమాన్యం నుంచి వచ్చిన సమాధానాలు కార్మిక ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయని వారు యాజమాన్యం తీరుపై తీవ్రంగా మండి పడ్డారు. సింగరేణి సొమ్ములను ఇష్టారీతిన దారా దత్తం చేస్తూ, కార్మికుల సమ స్యల పరిష్కారానికి మాత్రం ఆర్థిక సంక్షోభాన్ని చూపించడం సరికాదని యాజమాన్యం తీరు పై తీవ్రంగా విరుచుకు పడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన 35 వేల కోట్ల బకాయిలను వసూలు చేయకుండా సంస్థకు కేవలం వడ్డీ రూపంలో నష్టపోతున్న దానితో పోల్చుకుంటే పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రియంబ ర్స్మెంట్ సంవత్సరానికి 91 కోట్ల రూపాయలు పెద్ద సమస్య కాదని, అలాగే పైసా ఖర్చు లేకుండా చేయాల్సిన మారుపేర్ల అంశాన్ని కూడా విస్మరించడం, అందరికీ లాభదాయకంగా ఉండేటు వంటి సొంత ఇంటి పథకాన్ని పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించా ల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్ట్రక్చర్ సమావేశంలో మరోసారి కార్మికులను మోసం చేసిన ఏఐటీయూసీ నీ యాజమాన్యాన్ని నిలదీయాలని వారు కార్మికులకు సూచించారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ సింసంస్థను కాపాడి కార్మికుల సమస్యల పరిష్కారానికై చేసే కార్యచరణలో కార్మికులందరూ ఐక్యంగా కలసి వచ్చేల మా వంతు బాధ్యతను నెరవేరుస్తామని వారు స్పష్టం చేశారు.

# అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మందమర్రి మార్చి 9: వార్త మిర్రర్ ప్రతినిధి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 1999 -2000 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు అందరూ ఒకచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత బాల్య స్నేహితులందరూ విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకొని సందడి చేశారు. గత స్మృతులను, పాఠశాలలో చేసిన అల్లరి పనులను స్మరించుకున్నారు. సుదీర్ఘ విరామం అనంతరం బాల్య మిత్రులు అందరూ ఒకచోట కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించు కున్నారు.అనంతరం వారి కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాల ఆవరణలో కలియ తిరిగి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థినులు ఆత్మీయ సమ్మేళనంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పితమ జీవితాలను మలుపు తిప్పిన గురువులను వేదికపైకి ఆహ్వానించిన విద్యార్థులు, పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పి ప్రయోజులుగా తీర్చిదిద్దిన గురువులకు పలువురు విద్యార్థినులు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక వేడుకలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థినులు గ్రూప్ ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఇలాంటి మహాసమ్మేళనాలు తరచూ జరుపుకోవాలని నిర్ణయించారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్ గౌడ్, ఎన్ స్వామి, జి గురు ప్రసాద్, ఫక్రుద్దీన్, రమా, జ్యోతి లతో పాటు పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువజన రంగానికి రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలి




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 09

రాష్ట్ర ప్రభుత్వం 2025 - 2026 సంవత్సర బడ్జెట్ లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధు కృష్ణ, గడ్డం వెంకటేష్ అన్నారు. ఆదివారం రోజున చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి భవనంలో గుడ్డేటి సూర్జిత్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. తదనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువజన రంగానికి ఈ సంవత్సరం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని ఎన్నికల మేనిఫెస్టోలో రంగారెడ్డి జిల్లా వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకారం యువజన రంగానికి అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పి ఇప్పటివరకు డిక్లరేషన్ లో ఉన్న ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేసిన పరిస్థితి లేదని వారు అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్న నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి కల్పన చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వారు అన్నారు. యువతకు క్రీడా రంగానికి రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించడం వల్ల నిరుద్యోగ శాతాన్ని తగ్గించి ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని వారు సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా శాసనసభ్యులు యువజన రంగంపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖయ్యూం, ఎండి సలీం, సహాయ కార్యదర్శి కవిడే సురేష్, జిల్లా కమిటీ సభ్యులు బోదాసు నరేష్, సుర్వి కిరణ్, ఆకుల రాజు, మంద కిరణ్ కుమార్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు

# ఎండిన వరి పంటలను పరిశీలించిన బిజెపి నాయకులు

### రైతులు వల్లూరి శ్రీను వల్లూరి వెంకటయ్య



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 09

చౌటుప్పల్ మండలం మందోల గూడెం గ్రామపంచాయతీలో ఎండిన వరి పంటలను పరిశీలించిన బిజెపి నాయకులురైతులు వల్లూరి శ్రీను వల్లూరి వెంకటయ్య, నెట్టు లింగయ్య వల్లూరి శ్రీశైలం వరి పంట భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోతున్న పంటలను గొర్రెలు మేకలు మేపుచున్నారు. కొద్ది దూరంలో పిలాయిపెల్లి మూసి కాలువ వెళ్లుచున్నా ఈ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.స్థానిక అధికారులు మండలంలోని అన్ని గ్రామాలలోఎండుచున్న వరి పంటలను సందర్శించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసి రైతులకు నష్టపరిహారము అందించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది.కిలోమీటర్ దూరం నుండే మూసి పిలాయిపల్లి కాలువ నుండి తాగునీటిని ఈ గ్రామ రైతులకు తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.వెంటనే ఆ ప్రాంతానికి సాగునీరు అందించనట్లయితే రైతులు ఇంకా నష్టపోయే ప్రమాదం ఉన్నది.తక్షణమే యుద్ధ ప్రాతిపతకన ప్రత్యామ్నాయ%శీ% ఆలోచించాలని భారతీయ జనతా పార్టీ కోరుచున్నది 6 గ్యారంటీలు 420 హామీలు నెరవేర్చలేకపోయారు.కనీసం రైతులని ఆదుకునే ఆలోచన చేయాలని ఈ తెలంగాణ ప్రగల్భాల ప్రభుత్వానికి బిజెపి నాయకులు పత్రిక ముఖంగా తెలియజేస్తున్నారు.ఈ పర్యటనలో అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్,మండల అధ్యక్షులు కైరం కొండ అశోకు,నాయకులు ఊడుగు యాదయ్య గౌడ్, చినుకని మల్లేశం యాదవ్,కట్ట కృష్ణ ,ఆధారపు సత్తయ్య, కాయితి ముత్యాలు,తేలు కుంట్ల శ్రీధర్,పబ్బు వంశీ,బాతరాజు సైదులు,వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల కలను సాకారం చేసిన రేవంత్ రెడ్డి

### 33 కోట్ల నేతన్నల వ్యక్తిగత రుణమాఫీ-



మందమర్రి మార్చి 9 : వార్త మిర్రర్ ప్రతినిధి నేతన్నలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వ్యక్తిగత రుణమాఫీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేస్తూ, 33 కోట్ల వ్యక్తిగత రుణాన్ని మాఫీ చేశారు. అఖిలభారత, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభ ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించగా, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేతన్నలు చేనేత రుణమాఫీ చేయాలని అభ్యర్థించారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ నుండి వెళ్లిన వెంటనే ప్రత్యేక చొరవతో జీఓ నెంబర్ 56 ను విడుదల చేశారు. ఈసందర్భంగా 33 కోట్ల నేతన్నల వ్యక్తిగత రుణమాఫీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్రి అనిల్, పద్మశాలి సంఘం నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 1, 2017 నుండి మార్చి 31, 2024 లోపు లక్ష రూపాయలు లోపు తీసుకున్న వ్యక్తిగత రుణాలు మాఫీ చేసినట్లు సంఘం నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్థపు మురళి, అఖిలభారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, పద్మశాలి సంఘం యువజన నాయకుడు పిట్టల సుధాకర్ లు పాల్గొన్నారు.